
సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 21 । ఫిబ్రవరి । 2025



శిథిలావస్థలో ట్యాంకులు

జిల్లాలోని పలు ప్రాంతాలలో నిర్మించిన వాటర్ ట్యాంకులు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా తయారయ్యాయి.

- 9లో ▸



సమస్య తలెత్తకుండా చూడాలి

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ సంగ్వాన్ సూచించారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
34.5 /16.3

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ ఆర్టీసీ ఆఫీసర్



కామారెడ్డి టౌన్: నిజామాబాద్ రీజియన్ పరిధిలోని ఆర్టీసీ డిపోలలో శుక్రవారం డయల్ యువర్ ఆర్టీసీ ఆఫీసర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ రీజినల్ మేనేజర్ టి.జ్యోత్స్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు ఫోన్ చేసి ఫిర్యాదులు, సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

ఫోన్ చేయాల్సిన నంబర్లు..

రీజినల్ మేనేజర్, నిజామాబాద్ 99592 26011
డిపో మేనేజర్, కామారెడ్డి 99592 26018
డిపో మేనేజర్, బాన్సువాడ 99592 26020

'నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం'



మాట్లాడుతున్న ఎస్ఈ శ్రావణ్‌కుమార్

కామారెడ్డి టౌన్: వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్ కుమార్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని పలు సబ్ స్టేషన్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి సర్కిల్ పరిధిలో ఈ నెలలో ఒకరోజులో గరిష్ట విద్యుత్ డిమాండ్ 7.045 మిలియన్ యూనిట్లుగా నమోదయ్యిందన్నారు. రాబోయే మూడు నెలల్లో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగే అవకాశాలున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

పౌల్ట్రీపై వైరస్ దాడి

- వేల సంఖ్యలో కోళ్ల మృత్యువాత
- మూతపడుతున్న కోళ్ల ఫారాలు
- చికెన్ తినేందుకు జంకుతున్న జనం
- వెలవెలబోతున్న చికెన్ సెంటర్లు

పౌల్ట్రీ పరిశ్రమను అంతుచిక్కని వైరస్ పట్టి పీడిస్తోంది. వైరస్ బారిన పడి జిల్లాలో ఇప్పటికే వేలాది కోళ్లు మృత్యువాతపడ్డాయి. దీంతో పౌల్ట్రీ రైతులు తీవ్రంగా నష్టపోయారు. మరోవైపు బర్డ్‌ఫ్లూ అన్న భయంతో ప్రజలు చికెన్ తినడానికి వెనకాడుతుండడంతో చికెన్ సెంటర్లు వెలవెలబోతున్నాయి.

– కామారెడ్డి క్రైం

కోళ్లకు అంతుచిక్కని వైరస్ సోకుతోంది. దీంతో 15 రోజులుగా కోళ్లు మృతిచెందుతున్నాయి. మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతంలో బర్డ్‌ఫ్లూ కేసులు వెలుగు చూడడంతో ఇక్కడా అదే వైరస్‌తో కోళ్లు మృతి చెందుతున్నాయని అనుమానిస్తున్నారు. దీంతో అప్రమత్తమైన వెటర్నరీ అధికారులు.. కోళ్ల నుంచి నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లోగల ల్యాబ్‌కు పంపించారు. వాటి ఫలితాలు ఇంకా రావాల్సి ఉంది. ఫలితాలు వచ్చేంత వరకు ఏ వైరస్‌తో కోళ్లు మృతిచెందుతున్నాయో చెప్పలేమని అధికారులు పేర్కొంటున్నారు.

గిరాకీ లేక..

వైరస్ సోకి కోళ్లు మృతిచెందుతూ ఓవైపు కోళ్ల ఫారాలు ఖాళీ అవుతుండగా.. మరోవైపు చికెన్ తినాలంటే జనం జంకుతున్నారు. దీంతో పట్టణాలు, గ్రామాలు అనే వ్యత్యాసం లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ చికెన్ సెంటర్లు వెలవెలబోతున్నాయి. కోళ్ల అమ్మకాలు లేక ఇబ్బందిపడుతున్నామని చికెన్ సెంటర్ల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మృత్యువాత పడిన కోళ్లు

అప్రమత్తమైన యంత్రాంగం..

కోళ్లపై వైరస్ దాడి నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. వారం రోజుల క్రితం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆధ్వర్యంలో పౌల్ట్రీ రైతులు, వెటర్నరీ అధికారుల సమావేశం జరిగింది. పౌల్ట్రీ రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వెటర్నరీ అధికారులు వివరించారు. అంతే కాకుండా మహారాష్ట్ర నుంచి కోళ్లు మన జిల్లాలోకి రాకుండా సరిహద్దుల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయించారు. జిల్లాలోని సలాబత్‌పూర్‌తో పాటు నిజామాబాద్ జిల్లాలోని సాలూర, కందకుర్తి చెక్‌పోస్టుల వద్ద వెటర్నరీ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. కోళ్ల ఫారాల్లోకి ఎలాంటి వైరస్‌లు ప్రవేశించకుండా లోడింగ్, అన్‌లోడింగ్, ఇతర అవసరాల నిమిత్తం వచ్చే వాహనాలను, సిబ్బంది వస్తువులను 100 శాతం శానిటైజ్ చేయిస్తున్నారు.

6 వేల కోళ్లు చనిపోయాయి



నా షెడ్డులో 6 వేల కోళ్లు చనిపోయాయి. దీంతో రూ. లక్షల్లో నష్టం వచ్చింది. కోళ్లకు ఇన్సూరెన్స్ ఏమీ వర్తించదు. వైరస్‌తో నష్టపోయిన పౌల్ట్రీ రైతులను సర్కారు ఆదుకోవాలి. ప్రత్యేకంగా బీమా సౌకర్యాన్ని కల్పించాలి.

– సాయిలు, పౌల్ట్రీ రైతు, బోర్లం, బాన్సువాడ మండలం

జాగ్రత్తలు పాటించాలి



జిల్లాలో కోళ్లలో కనిపించిన వైరస్ బర్డ్‌ఫ్లూ అని నిర్ధారణ కాలేదు. కోళ్ల నుంచి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించాం. రిపోర్టులు రావాల్సి ఉంది. పౌల్ట్రీ రైతులు తమ ఫారాల్లోకి ఎలాంటి వైరస్ రాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి.

– రవి కిరణ్, అసిస్టెంట్ వెటర్నరీ సర్జన్, కామారెడ్డి

రైతులకు భారీ నష్టం

వైరస్ కారణంగా పౌల్ట్రీ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వేల సంఖ్యలో కోళ్లు మూకుమ్మడిగా మృత్యువాత పడుతుండడంతో ఆవేదన చెందుతున్నారు. చాలామంది రైతులు చికెన్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుని కోళ్లను పెంచుతున్నారు. కోడి పిల్లలు, దాణా కంపెనీలు సరఫరా చేస్తుంటాయి. మ్యాన్‌పవర్‌తోపాటు మిగతా ఏర్పాట్లు కోళ్ల ఫారాల నిర్వాహకులే చూడాల్సి ఉంటుంది. కోళ్లు చేతికొచ్చే సమయంలో ఒక్కసారిగా మృత్యువాతపడుతుండడంతో పౌల్ట్రీ రైతులకు దిక్కుతోచడం లేదు. బాన్సువాడ డివిజన్ పరిధిలోని తిర్మలాపూర్‌లో వెయ్యి, కిష్టాపూర్‌లో 2 వేలు, బోర్లంలో 6 వేలు, చింబోలి లో 1,500 కోళ్లు మృతిచెందాయి. నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్ ప్రాంతంలో పది రోజుల్లో సుమారు 60 వేల కోళ్లు చనిపోయాయి. వైరస్ కారణంగా కోళ్లు చనిపోతుండడంతో లక్షల రూపాయలు నష్టపోతున్నామని పౌల్ట్రీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్కారు ఆదుకోవాలని కోరుతున్నారు.

సీసీ కెమెరాలతో అనేక ప్రయోజనాలు

- ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు గుర్తించాలి
- మల్టీ జోన్–1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, వేదికపై ఎస్పీ సింధుశర్మ, ఏఎస్పీలు

కామారెడ్డి క్రైం: సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా అనేక రకాల ప్రయోజనాలు ఉంటాయని మల్టీ జోన్–1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాల ప్రాధాన్యతను గుర్తించాలన్నారు. గురువారం ఆయన కామారెడ్డికి వచ్చారు. జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూం, పట్టణంలోని ఇంటర్నేషనల్ హోటల్ నుంచి ఆర్అండ్‌బీ అతిథి గృహం వరకు ప్రధాన రహదారి వెంట నూతనంగా ఏర్పాటు చేసిన 98 సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటు విషయంలో సహకరించిన ఈ ప్రాంతంలోని దాతలందరినీ అభినందించారు. దొంగతనాలు, మహిళలపై వేధింపులు, చైన్‌స్నాచింగ్, చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా ఉండడానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఏదైనా ఘటన జరిగినా వెంటనే గుర్తించడానికి వీలు ఉంటుందన్నారు. అన్ని ప్రాంతాల ప్రజలు, వ్యాపార సముదాయాల వారు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడానికి ముందుకు రావాలని సూచించారు. అనంతరం సీసీ కెమెరాల కోసం విరాళాలు అందించినవారిని, సేకరణకు కృషి చేసిన కానిస్టేబుల్ కమలాకర్ రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ఎస్పీ సింధు శర్మ, అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, అసిస్టెంట్ ఎస్పీ చైతన్యరెడ్డి, పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ పార్క్ ప్రారంభం

దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ పార్క్‌ను మల్టీ జోన్–1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి ప్రారంభించారు. అన్ని రకాల సౌకర్యాలతో పార్క్‌ను ఏర్పాటు చేసిన అధికారులు, సిబ్బందిని అభినందించారు. పార్క్‌కు వచ్చిన చిన్నారులకు పుస్తకాలను బహూకరించారు. పీఎస్ ఆవరణలో మొక్కను నాటారు.



చిన్నారులకు పుస్తకాలను బహూకరిస్తున్న ఐజీ

అటవీ ప్రాంతంలో మంటలు



అటవీ ప్రాంతంలో వ్యాపిస్తున్న మంటలను ఆర్పుతున్న ఫారెస్ట్ అధికారి

నాగిరెడ్డిపేట: తాండూర్ సమీపంలోని అటవీ ప్రాంతంలో గురువారం రాత్రి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో ఫారెస్ట్ అధికారులు పెంచుతున్న నీలగిరి చెట్లు కొంతమేర దెబ్బతిన్నాయి. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న డీఎఫ్ఆర్వో రవికుమార్, బీట్ అధికారి నవీన్ ఘటన స్థలానికి చేరుకొని మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. చెలరేగిన మంటలను ఆర్పివేశారు. కాగా మండలంలోని బంజర సమీపంలో గల అటవీ ప్రాంతంలోనూ బుధవారం రాత్రి మంటలు చెలరేగడంతో ఫారెస్ట్ అధికారులు అక్కడికి వెళ్లి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఇటీవల మాల్తుమ్మెద విత్తనోత్పత్తి క్షేత్రంలోనూ మంటలు చెలరేగిన విషయం తెలిసిందే. మండలంలో జరుగుతున్న వరుస ఘటనలతో ఫారెస్ట్ అధికారులు ఆందోళన చెందుతున్నారు.

ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి

- ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి
- ప్రారంభమైన జాతీయ స్థాయి సెమినార్



బాలకిష్టారెడ్డిని సన్మానిస్తున్న తెయూ వీసీ యాదగిరిరావు, సౌత్‌క్యాంపస్ అధ్యాపకులు

భిక్కనూరు: యువత పదిమందికి ఉద్యోగాలు ఇచ్చే స్థితికి చేరుకోవాలని, దానికి అనుగుణంగా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి సూచించారు. భిక్కనూరులోని తెయూ సౌత్‌క్యాంపస్‌లో సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో గురువారం రెండురోజుల జాతీయ స్థాయి సెమినార్ ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా బాలకృష్టారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థులకు జాబ్ ఓరియంటెడ్ కోర్సులను ప్రవేశపెట్టడానికి ఉన్నత విద్యామండలి కసరత్తు చేస్తోందన్నారు. అలాగే వివిధ సంస్థలతో అవగాహన ఒప్పందాలు చేసుకుంటూ ఇంటర్న్‌షిప్ అవకాశాలు కూడా అందేలా చర్యలు తీసుకుంటోందన్నారు. సోషల్ వర్క్ కోర్సుతో విద్యార్థులకు ఉద్యోగావకాశాలు పెరిగాయని తెయూ వైస్ చాన్స్‌లర్ యాదగిరిరావు పేర్కొన్నారు. విద్యార్థుల పరిశోధనలకు కావాల్సిన సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులు చదువుతో పాటు జీవితానికి అవసరమైన పనులు నేర్చుకోవాలని తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు, సామాజికవేత్త ప్రసన్న కుమార్ సూచించారు. చదువుకుంటూనే కొత్త ఆవిష్కరణలు చెయ్యాలన్నారు. స్థానిక వనరులను ఉపయోగించుకుంటూ ఉద్యోగ అవకాశాల కల్పనకు కృషిచేయాలని వరంగల్ నిట్ ప్రొఫెసర్ పి.రాములు సూచించారు. సెమినార్ అనంతరం ఉన్నత విద్యామండలి చైర్మన్ సౌత్‌క్యాంపస్‌లోని కెమిస్ట్రీ ల్యాబ్‌ను పరిశీలించారు. సెమినార్‌లో తెయూ రిజిస్ట్రార్ యాదగిరి, సౌత్‌క్యాంపస్ ప్రిన్సిపల్ సుధాకర్‌గౌడ్, సెమినార్ కన్వీనర్ వీరభద్రం, సోషల్ వర్క్ హెచ్‌వోడీ రాజేశ్వరి, ఫిజిక్స్ హెచ్‌వోడీ మోహన్‌బాబు, కెమిస్ట్రీ బీవోఎస్ నాగరాజు, ఏపీఆర్‌వో సరిత, అధ్యాపకులు యాలాద్రి, నర్సయ్య, రమాదేవి, వైశాలి, నవీన్‌రావు, లలిత, ప్రతిజ్ఞ, కవిత పాల్గొన్నారు.

ఆటలకు చోటేదీ?

- మండల కేంద్రాలలో మైదానాలు కరువు
- కలగానే మినీ స్టేడియాలు
- ఆసక్తి ఉన్నా ఆటలాడలేకపోతున్న క్రీడాకారులు



లింగంపేటలో క్రీడా మైదానం కోసం ఎంపిక చేసిన స్థలం

లింగంపేట: జిల్లాలో కోచ్‌లు, వసతుల లేమితో ఆటలపై ఆదరణ తగ్గుతోంది. మైదానాలు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభ వెలుగులోకి రావడం లేదు. జిల్లా కేంద్రంలో అథ్లెటిక్స్ మినీ స్టేడియం తప్ప జిల్లాలోని 25 మండలాల్లో ఎక్కడా మినీ స్టేడియంలు లేవు. మండల స్థాయిలో కూడా సరైన మైదానాలు లేవు. దీంతో ఆయా గ్రామాల్లోని పాఠశాలల గ్రౌండ్‌నే క్రీడాకారులు ఉపయోగించుకుంటున్నారు. గతంలో క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. అయితే వాటిని పట్టించుకునేవారు లేకపోవడంతో మరుగునపడ్డాయి. వాటిని క్రీడా మైదానాలుగా మార్చి వసతులు కల్పించాలని క్రీడాకారులు కోరుతున్నారు.

సౌకర్యాలు లేకున్నా రాణిస్తున్న క్రీడాకారులు

జిల్లాలో సరైన వసతులు లేకపోయినా పలువురు క్రీడాకారులు ఆటల్లో సత్తా చాటుతున్నారు. కోమట్‌పల్లి గ్రామానికి చెందిన నాయిని అల్లురాజు వాలీబాల్, కబడ్డీ, హైజంప్, లాంగ్ జంప్, రన్నింగ్ అంశాలలో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో ప్రతిభచాటాడు.

బాణాపూర్‌కు చెందిన బరిగె నరేశ్, లింగంపేటకు చెందిన షానవాజ్, మోతె గ్రామానికి చెందిన సయ్యద్ సద్దాం హుస్సేన్, ప్రసాద్ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో రాణించారు. శెట్పల్లి హైస్కూల్ విద్యార్థినులు రుచిత, మేనక రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో సత్తా చాటారు. వీరంతా కేవలం పాఠశాలలు, గ్రామాల్లో ఉన్న ఖాళీ స్థలాలను వినియోగించుకుంటూ ఆటల్లో రాణిస్తున్నారు. మండల స్థాయిలో మినీస్టేడియాలు నిర్మిస్తే చాలా మంది క్రీడాకారులను తయారు చేయొచ్చని సీనియర్ క్రీడాకారులు పేర్కొంటున్నారు.

ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు



గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు, యువకులను క్రీడల్లో ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు వస్తాయి. ప్రాథమిక పాఠశాల నుంచి క్రీడలపై మక్కువతో పాఠశాల మైదానంలోనే సాధన చేశాను. జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించా.

– నాయిని అల్లురాజు, క్రీడాకారుడు, కోమట్‌పల్లి

ఆటలంటే ఇష్టం



చిన్ననాటి నుంచి క్రీడలంటే ఇష్టం. 2021లో చెన్నై ఎస్ఆర్ఎం యూనివర్సిటీ నుంచి జాతీయస్థాయిలో, 2024 డిసెంబర్‌లో సౌత్ జోన్ యూనివర్సిటీ నుంచి కేరళలోని త్రివేండ్రంలో జరిగిన వాలీబాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపా.

– షానవాజ్, క్రీడాకారుడు, లింగంపేట

క్రీడలూ అవసరమే..



సరైన మైదానాలు, సౌకర్యాలు లేక క్రీడాకారులు నిరాశకు గురవుతున్నారు. మండల కేంద్రాల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. అలాగే ఉన్నత పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులను నియమించాలి.

– రాజాగౌడ్, వ్యాయామ ఉపాధ్యాయుడు, లింగంపేట

పందుల కోసం వెళ్తే.. మృత్యుఒడికి

- విద్యుదాఘాతానికి ముగ్గురి బలి
- ఒకరిని కాపాడబోయి మరొకరు..
- మృతులందరిదీ ఒకే కుటుంబం
- ప్రాణాలతో బయటపడ్డ మరో ఇద్దరు కుటుంబ సభ్యులు
- సాటాపూర్‌లో నెలకొన్న విషాదం



మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబీకులు, బంధువులు



గంగారాం (ఫైల్)



బాలమణి (ఫైల్)



కిషన్ (ఫైల్)

రెంజల్(బోధన్) : విద్యుదాఘాతంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం పాలైన ఘటన తీవ్ర కలకలం రేపింది. రెంజల్ మండలం సాటాపూర్‌లో విషాదం నింపింది. పోలీసులు, మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రెంజల్ మండలం సాటాపూర్ గ్రామానికి చెందిన ఓర్సు గంగారాం(50)కు ఇద్దరు భార్యలు, ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఒకే ఇంట్లో ఉండే వీరందరూ వ్యవసాయ కూలీలుగా పనిచేసుకుంటూ అనుబంధంగా పందుల పెంపకం చేస్తుంటారు. ఇటీవల పెగడపల్లి, చిన్న మావంది గ్రామాల శివారులోని పంటపొలాల్లోకి పందు లు వస్తున్నాయని రైతులు చెప్పారు. దీంతో వాటిని పట్టుకునేందుకు గురువారం తెల్లవారు జామున ఓర్సు గంగారాం, మొదటి భార్య ఓర్సు బాలమణి (45), కొడుకు ఓర్సు కిషన్ (22) మిగతా కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. పట్టుకునే క్రమంలో కొన్ని పందులు పంటపొలాల్లోకి చొరబడ్డాయి. వాటి వెనకాలే వెళ్లిన గంగారాం, బాలమణి, కిషన్ పొలంలో ఉన్న విద్యుత్ తీగ లు తగిలి అక్కడికక్కడే కుప్పకూలారు. ప్రమాదాన్ని గమనించిన మిగతా కుటుంబసభ్యులు ఎక్కడికక్కడ నిలబడటంతో ప్రాణాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ విజయ్ బాబు, వెంకట నారాయణ, ఎస్సై మచ్చేందర్ రెడ్డి సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నా రు. పోలీసులే స్వయంగా స్థానికులతో కలిసి మృతదేహాలను బయటికి తీశారు. పోస్టుమార్టం నిమి త్తం జిల్లా ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. కాగా, ముగ్గురి మృతికి ట్రాన్స్‌కో నిర్లక్ష్యమే కారణమని గ్రామస్తులు, కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నా రు. విద్యుత్ తీగలు కిందికి వేలాడటంతో పందులను పట్టుకునే క్రమంలో తగిలి మొదట కిషన్ మృతిచెందగా, విద్యుత్ తీగలు పొలంలో పడటంతో తల్లిదండ్రులు సైతం విద్యుదాఘాతంతో మరణించినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

పెద్ద దిక్కును కోల్పోయి..

పందుల పెంపకంతో పాటు వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ జీవించే పేద కుటుంబం అనాథగా మారింది. విద్యుదాఘాతంతో గంగారాం, బాలమణి, కిషన్ మరణించగా మొదటి భార్య కుమారుడు ప్రవీణ్, కూతురు యశోద, రెండో భార్య శీల, పిల్లలు కృష్ణ, ప్రేమలత ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న ముగ్గురినీ ఒకేసారి కోల్పోవడంతో రోదనలు మిన్నంటాయి. అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి పేద కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పరీక్షలంటే భయం వీడాలి

- చదువులపై దృష్టి సారించాలి
- గురుకుల విద్యార్థులతో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

ఎల్లారెడ్డిరూరల్: విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. గురువారం ఆయన ఎల్లారెడ్డి పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. కష్టపడి చదవాలని సూచించారు. ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ ద్వారా చదువుపై దృష్టి సారించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో ప్రభాకర్, తహసీల్దార్ మహేందర్, మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్, ఆర్సీవో గంగారాం నాయక్, ప్రిన్సిపల్ సావిత్రి, ఎంపీవో ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలి

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గిరిజన బాలికల గురుకుల పాఠశాలను సందర్శించి వెళ్తుండగా స్థానికులు ఆయనను కలిశారు. నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందించారు.

క్లుప్తంగా

ఉద్యోగ భద్రత కల్పించాలి

- ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు కాంట్రాక్టు అధ్యాపకుల వినతి


వినతి పత్రమిస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

భిక్కనూరు: ఎన్నో ఏళ్లుగా యూనివర్సిటీల్లో పని చేస్తూ విద్యాభివృద్ధికి కృషిచేస్తున్న తమకు యూజీసీ స్కేలు వర్తింపజేయడంతో పాటు, ఉద్యోగ భద్రత కల్పించాలంటూ సౌత్‌క్యాంపస్‌లో ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డికి కాంట్రాక్టు అధ్యాపకులు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని, తొందరలోనే పరిష్కరిస్తుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ గుప్తా, మహాత్మాగాంధీ యూనివర్సిటీ నేత నవీన్, కాంట్రాక్టు అధ్యాపకులు యాలాద్రి, సునీత, పిట్ట సరిత, రమాదేవి, నరసయ్య, దిలీప్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయకపోతే బహిష్కరిస్తాం


వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

లింగంపేట(ఎల్లారెడ్డి): నిధులు విడుదల చేయని పక్షంలో మార్చి 1 నుంచి విధులు బహిష్కరిస్తామని, గ్రామ పంచాయతీల్లో నిధులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలుపుతూ పంచాయతీ కార్యదర్శులు మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీవో సురేందర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సంవత్సర కాలంగా పంచాయతీల్లో నిధులు లేక చేతి డబ్బులు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు. లేదంటే కార్యదర్శులు గ్రామాల్లో తిరిగే పరిస్థితి ఉండదన్నారు. అంతకు ముందు ప్రత్యేకాధికారి కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఎంపీడీవో నరేశ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరించి పేస్కేల్ అమలు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

కామారెడ్డి టౌన్: సమగ్ర శిక్ష ఉద్యోగుల క్రమబద్ధీకరణ, పేస్కేల్ అమలు కోసం కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరుతూ గురువారం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఢిల్లీలో సమగ్ర శిక్ష ఉద్యోగులు కలిసి వినతిపత్రం అందజేసినట్లు సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ తెలిపారు. బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రిని కలిసి తమకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు. పే స్కేల్ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం నివేదిస్తే కేంద్రం వాటా 60 శాతం చెల్లిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు సత్యనారాయణ చెప్పారు.

ఒత్తిడిలో విద్యార్థులు

- మార్కుల వేటలో పెరుగుతున్న ఆందోళన
- ఆత్మవిశ్వాసం కల్పించాలంటున్న మానసిక నిపుణులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: మార్కుల వేటలో విద్యార్థులు ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా భవిష్యత్తును నిర్దేశించే పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్న ఆరాటం వారిని తీవ్రమైన ఒత్తిడికి గురిచేస్తోంది. బోర్డ్ ఎగ్జామ్స్ వస్తున్నాయంటే సహజంగానే విద్యార్థులు ఒత్తిడికి గురవుతుంటారు. దీనికితోడు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకుల నుంచి ఒత్తిడి ఉండనే ఉంటుంది. కొందరు విద్యార్థులు నిర్భయంగా పరీక్షలు రాయడానికి ప్రిపేర్ అవుతుండగా, చాలా మంది తాము ప్రిపేర్ అయిన ప్రశ్నలు రాకుంటే మార్కులు తగ్గుతాయేమోననే భయంతో వణికిపోతుంటారు. పిల్లల్లో ధైర్యం నింపడానికి ఉపాధ్యాయులు ప్రయత్నాలు చేస్తున్నా కొందరు మాత్రం పరీక్షలు దగ్గర పడుతున్న కొద్దీ భయంతోనే గడుపుతుంటారు. ఈ తరుణంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు వారికి అండగా నిలవాలి. వారిలో ధైర్యాన్ని నింపాలి. అన్నింటికంటే ముఖ్యంగా వారిపై వారికి ఆత్మవిశ్వాసం కల్పించాలి. ఎంత చదవగలిగితే అంత చదువు, టెన్షన్ అవసరం లేదు, మార్కులు కొలమానం కానేకాదని వారికి నచ్చజెప్పాలి తప్ప, వేరే వాళ్ల పిల్లలతో పోల్చే ప్రయత్నం చేయొద్దు. అలా చేయడం వల్ల విద్యార్థులు మరింత ఒత్తిడికి లోనవుతారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు మానసిక స్థైర్యాన్ని కలిగించే ప్రయత్నాలు జరగాల్సిన అవసరం ఉంది.

మార్చి 5 నుంచి పరీక్షలు..

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు వచ్చే నెల 5 నుంచి మొదలై 25 వరకు కొనసాగుతాయి. జిల్లాలో మొదటి సంవత్సరం పరీక్షలకు 8,743 మంది విద్యార్థులు, రెండో సంవత్సరం పరీక్షలు 9,729 మంది విద్యార్థులు రాయనున్నారు. అలాగే జిల్లాలో పదో తరగతి పరీక్షలకు 12,579 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇప్పటికే సిలబస్ పూర్తి చేయడంతో పాటు రివిజన్ కూడా జరిగింది. ప్రిఫైనల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. పిల్లలకు ప్రత్యేక క్లాసులు జరుగుతున్నాయి. రాత్రింబవళ్లు చదువుతున్నారు.

ప్రస్తుత చదువులు మార్కులే కొలమానంగా సాగుతున్నాయి. విద్యార్థులు పోటీపడి మార్కులు తెచ్చుకుంటున్నారు. చదువులు, పరీక్షల సమయంలో కొందరు తీవ్ర ఒత్తిడికి గురవుతూ మానసికంగా కుంగిపోతున్నారు. దీంతో ఆరోగ్యమూ దెబ్బతింటోంది. మార్కులు తక్కువ వచ్చాయనో, ఫెయిల్ అయ్యామనో ఆవేదనకు గురై కొందరు ఆత్మహత్యలకు పాల్పడి తల్లిదండ్రులకు మనోవేదన మిగుల్చుతున్నారు.



ఆందోళన అధిగమిస్తేనే విజయం..

పరీక్షలు అనే సరికి విద్యార్థుల్లో రకరకాల ఆందోళనలు వస్తాయి. కొన్ని వారిని తీవ్రంగా వేదనకు గురిచేస్తాయి. ఈ తరుణంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు వారికి అండగా నిలవాలి. ఆందోళన అధిగమిస్తే విజయం సొంతమవుతుందన్న విషయాన్ని వారికి విడమర్చి చెప్పాలి. నిరంతరం చదువు మీద తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఒత్తిడి పెట్టకుండా ఉండాల్సిన అవసరమూ ఉంది.

మానసిక స్థైర్యాన్ని నింపాలి



పరీక్షలు అనగానే సహజంగానే విద్యార్థులకు భయం ఉంటుంది. భయాన్ని తొలగించే ప్రయత్నం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుంచి రావాలి. ప్రస్తుత విద్యావ్యవస్థలో ఉన్న ఒత్తిడి వల్ల పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారు. వారిని జాగ్రత్తగా గమనించాలి. మానసిక స్థైర్యాన్ని ఇవ్వడం ద్వారా వారు ధైర్యంగా పరీక్షలు రాయడానికి సమాయత్తమవుతారు. ఆ దిశగా ప్రయత్నించాలి. – సి.వీరేందర్, సైకాలజిస్ట్

అందరిలో మార్పు రావాలి



ఇప్పుడందరి ఆలోచన తన బిడ్డ టాప్‌లో నిలవాలన్నదే. పిల్లల మానసిక పరిస్థితిని చూడటం లేదు. ఇతరుల పిల్లల మాదిరిగా తమ పిల్లలు చదవాలనే పట్టుదలకు పోతున్నారు. మార్కుల కన్నా జ్ఞానం అవసరం అన్న విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలి. చదువు విషయంలో వారికి ధైర్యమివ్వాలే తప్ప వారిపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు చేయొద్దు. – జి.లచ్చయ్య, రిటైర్డ్ డైట్ లెక్చరర్

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. గురువారం ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా నీటి సమస్య రాకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. నీటి ఎద్దడి ఉండే ప్రాంతాలను గుర్తించి అక్కడ బోరుబావులకు అవసరమైన మరమ్మతులు చేయించాలన్నారు. వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి నీటిని అందించాలని సూచించారు. అనంతరం డంపింగ్ యార్డును పరిశీలించారు. తడి చెత్తతో కంపోస్టు ఎరువులను తయారు చేయాలని సూచించారు. చెట్లకు నీరు పట్టాలన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్

పురాతన ఆలయాలను అభివృద్ధి చేయాలి

- సనాతన ధర్మమే ప్రపంచానికి మార్గదర్శి
- తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామీజీ


ఉత్సవంలో పాల్గొన్న తొగుట పీఠాధిపతి

భిక్కనూరు: కొత్త దేవాలయాలను నిర్మించడం కంటే పురాతన ఆలయాలను అభివృద్ధి చేయడంతో పాటు జీర్ణోద్ధరణ కార్యక్రమాలను చేపట్టాలని తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామీజీ అన్నారు. బుధవారం బస్వాపూర్‌లో అతి పురాతన ఉమామహేశ్వరాలయం జీర్ణోద్ధరణ కార్యక్రమంలో స్వామీజీ పాల్గొని భక్తులనుద్దేశించి మాట్లాడారు. రానున్న రోజుల్లో సనాతన ధర్మమే ప్రపంచానికి మార్గదర్శకం చూపిస్తుందన్నారు. అన్ని మతాల వారు సనాతన ధర్మం వైపు వస్తున్నారన్నారు. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహకుంభమేళాలో ప్రపంచంలోని నలుమూలల నుంచి ప్రజలు వచ్చి పుణ్యస్నానాలు ఆచరించటం దీనికి నిదర్శనమన్నారు. సామూహిక వ్రతాలు, పూజలు చేయడం వల్ల సోదరభావం పెంపొందుతుందన్నారు. ప్రపంచమంతా మన దేశ సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తుంటే మన దేశ యువతలో కొందరు పాశ్చాత్య పోకడలకు వెళ్లి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఉమామహేశ్వరాలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ మద్ద లింగం, ప్రతినిధులు గౌరిగారి రాజిరెడ్డి, చాపత్త స్వామి, సిద్దరాములు, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి ఇచ్చి ఓట్లు అడగాలి

బాన్సువాడ: నిరుద్యోగ భృతి ఇచ్చి నిరుద్యోగులను కాంగ్రెస్ పార్టీ అప్పుడు ఓట్లు అడగాలని బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి చిన్నమైల్ వ్యాఖ్యానించారు. గురువారం బాన్సువాడలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓట్లు అడిగే హక్కు లేదని, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ముందు అమలు చేసి పట్టభద్రులను ఓట్లు అడగాలని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నరేందర్‌రెడ్డి ముందు ప్రభుత్వం బకాయిపడ్డ ఫీజురియంబర్స్‌మెంట్‌ను విడుదల చేయించాలని అన్నారు. విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించారని విమర్శించారు. తనను గెలిపిస్తే స్కిల్ డెవలప్‌మెంట్‌ను పెట్టిస్తానని అన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు తనకే వేయాలని పట్టభద్రులను కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు నీలం చిన్నరాజులు, మాజీ ఎంపీ బీబీ పాటిల్, నాయకులు పెద్దోళ్ల గంగారెడ్డి, పైడి ఎల్లారెడ్డి, చీదరి సాయిలు, శంకర్‌గౌడ్, కోనాల గంగారెడ్డి, తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి

నేడు సబ్‌జూనియర్ బేస్‌బాల్ జట్ల ఎంపికలు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): జిల్లా సబ్ జూనియర్ బేస్‌బాల్ బాలికలు, బాలుర జట్ల ఎంపిక పోటీలను శుక్రవారం నిర్వహించనున్నట్లు జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మధుసూదన్‌రెడ్డి, సొప్పరి వినోద్ ఒక ప్రకటనలో తెలిపారు. డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి గ్రామ శివారులోగల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో నేడు ఉదయం 9 గంటలకు బాలికల జట్టు ఎంపిక పోటీలను నిర్వహిస్తామని వారు తెలిపారు. అలాగే బాలుర జట్టు ఎంపిక పోటీలకు ఆర్మూర్‌లోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల/కళాశాలలో నిర్వహిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనవరి 2010 తర్వాత జన్మించి ఉండాలని, ఆసక్తి గలవారు జిల్లా కోచ్‌లు నరేష్, మౌనిక, జోత్స్నలకు రిపోర్ట్ చేయాలని సూచించారు.

క్రైం కార్నర్



ప్రమాదానికి కారణమైన కారు


యశోద మృతదేహం

కామారెడ్డి క్రైం: అదుపు తప్పిన కారు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలోని గోదాం రోడ్డులో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు ఇలా. కామారెడ్డి మండలం శాబ్దిపూర్ గ్రామానికి చెందిన రేకులపల్లి యశోద (68) అనే వృద్ధురాలు వ్యక్తిగత పనుల మీద కామారెడ్డికి వచ్చి, ఇంటికి తిరిగి వెళ్లేందుకు గోదాం రోడ్డులో ఉన్న ఎఫ్‌సీఐ గోదాం వద్ద రోడ్డు పక్కన నిలబడి ఉంది. అదే సమయంలో డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో ఓ కారు బీభత్సం సృష్టించింది. అదుపుతప్పిన కారు మొదట వృద్ధురాలిని ఢీకొని ఆపై పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని సైతం ఢీకొంది. స్తంభానికి, కారుకు మధ్య వృద్ధురాలు చిక్కుకోవడంతో స్థానికులు గమనించి, వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కొద్దిసేపటికే ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. మృతురాలి కుమారుడు తిరుపతిరెడ్డి ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో గురువారం జరిగిన వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతిచెందారు. రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు, సంపులో పడి ఒకరు, చేపలవేటకు వెళ్లి ఒకరు మృత్యువాతపడ్డారు.

రెండు బైక్‌లు ఢీకొని..

బోధన్‌రూరల్: మండలంలోని చిన్నమావంది బ్రిడ్జి వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. చిన్నమావంది గ్రామానికి చెందిన గంగొండ (64) బుధవారం రాత్రి పెగడపల్లి వెళ్లి తన బైక్‌పై గ్రామానికి తిరిగివస్తున్నాడు. అదే సమయంలో కల్దుర్కి గ్రామానికి చెందిన ఉమాకాంత్, తన చిన్నమ్మతో కలిసి పెగడపల్లి వైపు వెళ్తుండగా చిన్నమావంది బ్రిడ్జి వద్ద గంగొండ వాహనాన్ని ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గంగొండ అక్కడికక్కడే మృతిచెందగా ఉమాకాంత్, అతని చిన్నమ్మ శోభ గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. మృతుడు గంగొండ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై మచ్చేందర్‌రెడ్డి గురువారం తెలిపారు.

సంపులో పడి గుర్తు తెలియని మహిళ..



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కమలా నేహ్రూ కాలనీ బృందావన్ టాకీస్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న భవనం సంపులో పడి గుర్తుతెలియని మహిళ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. నూతనంగా నిర్మిస్తున్న భవనంలో వాచ్‌మెన్ లేకపోవడంతో బుధవారం రాత్రి సమయంలో గుర్తుతెలియని మహిళ భవనం లోపల నిద్రించింది. ఒక్కసారిగా ఆమెకు ఫిట్స్ రావడంతో పక్కనే ఉన్న సంపుపడి మృతిచెందింది. మృతురాలి వయస్సు సుమారు 40ఏళ్లు ఉంటాయని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రిలో తరలించామని పోలీసులు తెలిపారు. మృతురాలి సంబంధికులు ఎవరైన ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ పేర్కొన్నారు.

చేపలవేటకు వెళ్లి మత్స్యకారుడు..


నడ్పి రాజన్న మృతదేహం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో చేపల వేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడు ప్రమాదవశాత్తు మృతిచెందాడు. ముప్కాల్ ఎస్సై రజనీకాంత్ తెలిపిన వివరాలు ఇలా.. ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన బట్టు నడ్పిరాజన్న (52) రోజు మాదిరిగా బుధవారం రాత్రి ఎస్సారెస్పీలోకి చేపలవేటకు వెళ్లాడు. రాత్రి భోజన సమయానికి గట్టుకు రాకపోవడంతో తోటి మత్స్యకారులు అనుమానంతో గాలింపు చేపట్టారు. గురువారం ఉదయం అతడి మృత దేహం లభ్యమైంది. కాళ్లకు వల చుట్టుకుని ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతిచెందినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య


సొప్పరి మాణిక్యం(ఫైల్)

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని గుర్జాల్ గ్రామానికి చెందిన ఓ రైతు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాలు ఇలా.. గుర్జాల్ గ్రామానికి చెందిన సొప్పరి మాణిక్యం(40) అనే రైతు తనకున్న పొలంలో రెండు బోర్లు వేయగా విఫలం అయ్యాయి. కొన్ని రోజులు బతుకుదెరువు కోసం గల్ఫ్‌కు వెళ్లి వచ్చాడు. అయినా చేసిన అప్పులు తీరక, తీర్చే మార్గం లేక మనోవేదనకు గురయ్యాడు. ఈక్రమంలో బుధవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన మాణిక్యం అక్కడే పురుగుల మందు తాగి తూలుతు ఇంటికి వచ్చాడు. గమనించిన ఆయన కుమారులు, భార్య చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది ఒకరు..

మాక్లూర్: మండలంలోని బోర్గాం(కె) గ్రామంలో ఓ వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాలు ఇలా.. బోర్గాం(కె) గ్రామానికి చెందిన రెంజర్ల లస్మన్న (57)కు మూడేళ్ల క్రితం గుండె ఆపరేషన్ అయింది. అప్పటి నుంచి వ్యాధికి సంబంధించిన మందులు వాడుతునే ఉన్నాడు. మరిన్ని వ్యాధులకు గురికావడంతో జీవితంపై విరక్తి చెందాడు. ఈక్రమంలో బుధవారం రాత్రి సమీపంలో ఉన్న చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు మహేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కామారెడ్డిలో మరొకరు..

కామారెడ్డి క్రైం: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లా కేంద్రంలో గురువారం వెలుగుచూసింది. వివరాలు ఇలా.. కాలనీలో నివాసం ఉండే పసుపునూరి నాగయ్య (30) స్థానికంగా ఓ మొబైల్ షాప్‌లో పని చేసేవాడు. అతడికి నాలుగేళ్ల క్రితం రమ్యతో వివాహం జరుగగా, వారికి ఇద్దరు పిల్లలున్నారు. నాగయ్య ఇటీవల మద్యానికి బానిస కాగా, దంపతుల మధ్య తరచు గొడవలు జరిగేవి. బుధవారం రాత్రి కూడా గొడవలు జరుగగా భార్య వేరే గదిలో పడుకుంది. నాగయ్య మరో గదిలో పడుకోగా ఉదయం చూసేసరికి చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

తీసుకున్న అప్పు చెల్లించాలన్నందుకే హత్య

- నాగేంద్రనగర్ ఆశావర్కర్ మర్డర్ మిస్టరీని ఛేదించిన పోలీసులు
- నిందితుడి పట్టివేత


కొండ లక్ష్మి(ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): ఏర్గట్ల మండలం నాగేంద్రనగర్‌కు చెందిన ఆశావర్కర్ కొండ లక్ష్మి(45) జనవరి 21న అదృశ్యమై, చివరకు హత్యకు గురైన విషయం విదితమే. ఈ ఘటనలో నిందితుడిని బుధవారం పోలీసుల అరెస్టు చేశారు. ఈక్రమంలో హత్యకు సంబంధించి 'సాక్షి' సేకరించిన సమాచారంలో అనేక ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిర్మల్ జిల్లా మామడ మండలం పొన్కల్‌కు చెందిన కుంచపు వెంకటేష్ కూలీ పని చేయడానికి గతంలో నాగేంద్రనగర్‌కు వచ్చాడు. ఈక్రమంలో ఒంటరిగా ఉంటున్న లక్ష్మితో పరిచయం పెంచుకుని ఆమె ఇంటిలో కూలీ పని చేసేవాడు. ఆమెను నమ్మించి కొంత నగదును చేబదులుగా తీసుకున్నాడు. ఆమె ఇచ్చిన సొమ్మును తిరిగివ్వాలని అడగడంతో కోపం పెంచుకున్న వెంకటేష్ ఫోన్ చేసి పొన్కల్‌కు వస్తే డబ్బులు ఇస్తానని నమ్మించాడు. అతని మాటలు నమ్మిన లక్ష్మి పొన్కల్ వెళ్లగా మాయమాటలు చెప్పి, దట్టమైన అటవీ ప్రాంతానికి తీసుకువెళ్లాడు. అనంతరం ఆమెపై దాడి చేసి మెడలో ఉన్న బంగారు గొలుసును తీసుకున్నాడు. హత్య చేసి మృతదేహాన్ని ఎవరికి కనపడకుండా చెట్టు చాటున ఉంచి గ్రామానికి చేరుకున్నాడు. ఏమీ ఎరుగనట్లు నిజామాబాద్, నిర్మల్ మార్కెట్‌లలో ఉల్లిగడ్డలు అమ్ముతున్నాడు. తనకు ఆరోగ్యం బాగలేదని ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నట్లు పత్రాలను సైతం సృష్టించాడు. కానీ మృతురాలు లక్ష్మి, నిందితుడు వెంకటేష్ ఫోన్‌లు ఒకే సమయంలో ఒకేచోట స్విచ్‌ఆఫ్ కావడంతో వెంకటేష్ కుట్ర కోణంపై పోలీసులు నిర్ధారణకు వచ్చారు. నిందితుడి కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి అదుపులోకి తీసుకుని, తమదైన శైలిలో విచారించారు. దీంతో ఆమెను ఇంటి వద్ద నుంచి వచ్చిన రోజునే హత్య చేసి, శవంను అటవీ ప్రాంతంలో దాచి ఉంచినట్లు నిందితుడు అంగీకరించాడు. మృతదేహాన్ని దాచిన ప్రాంతానికి పోలీసులను తీసుకువెళ్లి చూయించాడు. అందరితో కలుపుగోలుగా ఉండే లక్ష్మి హత్యకు గురికావడాన్ని గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు.

ట్రాలీ ఆటో ఢీకొనడంతో విద్యార్థులకు గాయాలు



గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రం తిప్పారం రోడ్డులోని ఎస్టీ హాస్టల్ వద్ద గురువారం సాయంత్రం ఇద్దరు విద్యార్థులను ట్రాలీ ఆటో (టాటా ఏస్) వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండలానికి చెందిన ఇద్దరు చిన్నారులు అర్జున్–4వతరగతి, సాయికల్యాణ్–3వ తరగతి (అన్నదమ్ములు) హాస్టల్ బయట ఉండగా, మండల కేంద్రంలోని ఓ వాటర్ ప్లాంటుకు చెందిన టాటా ఏస్ వాహనం నీటిక్యాన్‌లతో తిప్పారం వైపు వెళ్తుండగా వారిని ఢీకొట్టింది. ఈఘటనలో కల్యాణ తలకు బలమైన గాయాలు కాగా, అర్జున్ కాలు విరిగింది. క్షతగాత్రులను 108 అంబులెన్సులో కామారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలించారు. హాస్టల్ పీఈటీ ఫిర్యాదు మేరకు వాహనాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవర్ అస్లామ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మెరుగైన వైద్యం అందిస్తున్నాం..

కామారెడ్డి క్రైం: ప్రమాదం విషయంపై కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ స్పందించారు. వివరాలు తెలుసుకున్న ఆయన జరిగిన ఘటనపై ఆరా తీశారు. గాయపడిన ఇద్దరు విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం వారిని నిజామాబాద్ జనరల్ ఆస్పత్రిలో చేర్పించి మెరుగైన వైద్యం అందిస్తున్నామని డీపీఆర్‌వో భీంకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

పెట్రోలింగ్ వాహనాన్ని ఢీకొని..



ఇందల్వాయి: మండలంలోని 44వ నంబరు జాతీయ రహదారిపై గన్నారం గ్రామ శివారులో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇందల్వాయి టోల్‌ప్లాజా సిబ్బందికి గాయాలయ్యాయి. పెట్రోలింగ్ వాహనంలో టోల్‌ప్లాజా సిబ్బంది ఒకరు రోడ్డు నిర్వహణ పనులు పర్యవేక్షిస్తున్న సమయంలో, కామారెడ్డి నుంచి నిజామాబాద్‌వైపు స్టీల్ లోడ్‌తో వేగంగా వెళుతున్న ఐచర్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పెట్రోలింగ్ వాహన డ్రైవర్ వడ్ల బ్రహ్మం గాయపడ్డాడు. వెంటనే అతడిని టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రానికి తరలించారు.

ఇంట్లోకి వెళ్లి బంగారం అపహరణ

ఖలీల్‌వాడి: నగరంలోని బోర్గాం(పి)లోగల ఓ ఇంట్లోకి గుర్తుతెలియని దుండుగుడు వెళ్లి, మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును ఎత్తుకెళ్లినట్లు 4వ టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం బైక్‌పై వచ్చిన దుండగుడు ఇంట్లోకి వెళ్లి సుంకరి కళావతి అనే మహిళ మెడలో నుంచి తొమ్మిది మాసాల బంగారం ఎత్తుకెళ్లాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాడుతున్న ఆరుగురు అరెస్టు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణ శివారులోని ఆటోనగర్ కాలనీలో గురువారం రాత్రి పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ నారాయణ తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి రూ. 10,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. 6బైక్‌లు, 5 సెల్‌ఫోన్‌లను సీజ్ చేశామన్నారు.

కొత్తపేటలో దారిదోపిడీ

నిజామాబాద్ రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో బీహార్‌కు చెందిన పలువురు హమాలీలు దారిదోపిడీకి పాల్పడారు. రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరీఫ్ తెలిపిన వివరాలు ఇలా.. ఎడపల్లి మండలం కుర్నాపల్లి గ్రామానికి చెందిన జితేష్ బుధవారం ఉదయం నిజామాబాద్‌కు శుభకార్యం నిమిత్తం వెళ్లగా, అర్ధరాత్రి తిరిగి సొంతూరికి బయలుదేరాడు. రూరల్ మండలం కొత్తపేట గ్రామ శివారులోని నిజాంసాగర్ కెనాల్ వద్ద అతడిని స్థానికంగా ఉన్న రైస్‌మిల్‌లో పనిచేస్తున్న హమాలీలు అడ్డుకొని కర్రలతో కొట్టి, చేతిపై తీవ్రగాయాలు చేశారు. అనంతరం అతడి వద్ద ఉన్న రూ.1000 నగదు, సెల్‌ఫోన్ దొంగిలించారు. బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు వివరించారు.

ముగ్గురు బైండోవర్

బిచ్కుంద(జుక్కల్): మండలకేంద్రంలోని తహసీల్దార్ సురేష్ ఎదుట గురువారం ముగ్గురు వ్యక్తులను పోలీసులు బైండోవర్ చేశారు. సాయిలు, యాదవ్, నరేష్ అనే వ్యక్తులు చిన్నచిన్న దొంగతనాలకు పాల్పడుతుండేవారు. అలాగే దేవాడకు చెందిన రాజు అక్రమంగా మద్యం అమ్ముతుండేవాడు. ఈక్రమంలో వారిని పోలీసులు పట్టుకొని కేసునమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

ఒకరిపై పోక్సో కేసు నమోదు

రామారెడ్డి: మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన గుజ్జుల నవీన్ అదే గ్రామానికి చెందిన ఓ 8 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసిన ఘటన చోటుచేసుకుందని రామారెడ్డి ఎస్సై నరేష్ గురువారం తెలిపారు. దీంతో బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి ఒకరోజు జైలు

బోధన్‌టౌన్(బోధన్): మద్యం తాగి వాహనం నడిపిన ఓ వ్యక్తికి బోధన్ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు సీఐ వెంకటనారాయణ గురువారం తెలిపారు. పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీకి చెందిన షేక్ హుస్సేన్ ఇటీవల మద్యం తాగి వాహనం నడుపుతుండగా, పోలీసుల డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డాడు. అతడిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఒకరోజు జైలు శిక్షను విధించాడని సీఐ తెలిపారు.